ప్రజాశక్తి
గురువారం 22 మే 2025

తహశీల్దార్ కార్యలయం ముందు ఆందోళన చేస్తున్న రైతు సంఘం నాయకులు, రైతులు

భూసేకరణకు వ్యతిరేకంగా కదం తొక్కిన రైతులు

మద్దతుగా నిలిచిన సిఐటియు, రైతు సంఘం నాయకులు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం నియోజకవర్గంలో చేపట్టిన బలవంతపు భూసేకరణకు వ్యతిరేకంగా రైతన్నలు కదం తొక్కారు. హిందూపురం రూరల్ మండలం మలగూరు రెవెన్యూ పొలం పరిధిలో ఉన్న మలగూరు, చలివెందుల, రాచపల్లి, లేపాక్షి మండలం కొండూరు, సోమందేపల్లి మండలం నడింపల్లి తదితర గ్రామాల పరిధిలో దాదాపు 400 మంది రైతులకు చెందిన 2 వేల ఎకరాల భూమిని భూ సేకరణ చట్టం ద్వారా సేకరించాలని అధికారులు చర్యలు తీసుకున్నారు. దీనిని వ్యతిరేకిస్తూ ఆయా గ్రామాల పరిధిలో ఉన్న రైతులు బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. రైతులు కార్యాలయంలోకి దూసుకు వెళ్లడానికి ప్రయత్నం చేయడంతో అధికారులు అడ్డుకున్నారు. రైతులు చేపట్టిన ఆందోళనకు సిఐటియు జిల్లా అధ్యక్షులు జెడ్ పి శ్రీనివాసులు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి జంగాలపల్లి పెద్దన్న, పట్టు రైతు సంఘం రాష్ట్ర నాయకులు ధనాపురం వెంకటరామిరెడ్డి, ఒపిడిఆర్ రాష్ట్ర నాయకులు శ్రీనివాసులు, జలసాధన సమితి జిల్లా నాయకులు చైతన్య గంగిరెడ్డి ఇతర ప్రజా సంఘాల నాయకులు మద్దతుగా నిలిచారు. ప్రభుత్వం చేపట్టిన భూ సర్వే నిలిపి వేయాలని, భూ సేకరణ చేపట్ట రాదని నినాదాలు చేస్తూ తహశీల్దార్ కార్యాలయంలోకి రైతులు దూసుకెళ్లారు. దీంతో డిప్యూటీ తహశీల్దార్ మైనుద్దీన్, రైతులు, రైతు సంఘం నాయకుల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. అధికారులు మంగళవారం ఆయా గ్రామాల్లో చాటింపు వేసి రైతులు వారి పొలాలకు సంబంధించిన పాసుపుస్తకాలు, 1బి అడంగల్ ఇతర ధ్రువీకరణ పత్రాలు తీసుకురావాలని చెప్పారని ఎందుకని అడిగితే ఏ ఒక్కరు కూడా దానికి సమాధానం చెప్పడం లేదని, తహశీల్దార్ అయినా దీనికి సరైన సమాధానం చెప్పాలని వారు డిమాండ్ చేశారు. తహశీల్దార్ అందుబాటులో లేరని వినతి పత్రాన్ని తనకు ఇస్తే తహశీల్దార్ వచ్చిన అనంతరం చర్చించి రైతులకు న్యాయం చేస్తామని డిప్యూటీ తహశీల్దార్ రైతులకు సూచించారు. తహశీల్దార్ వచ్చేవరకు ఇక్కడి నుంచి కదిలే ప్రసక్తే లేదని రైతులు తేల్చి చెప్పి దాదాపు 5 గంటల పాటుకార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు జెడ్ పి శ్రీనివాసులు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి జంగాలపల్లి పెద్దన్న, సిద్ధారెడ్డి, పట్టు రైతు సంఘం రాష్ట్ర నాయకులు ధనాపురం వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ పంజాబ్ రైతులు చేసిన ఉద్యమ స్ఫూర్తితో రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన భూసేకరణకు వ్యతిరేకంగా ఉద్యమిద్దామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రికి స్వయాన బావమరిది ప్రాతినిధ్యం వహిస్తున్న బాలకృష్ణ నియోజకవర్గంలో ఏడాదికి మూడు పంటలు పండే రెండు వేల ఎకరాల భూమిని ప్రభుత్వం భూ సేకరణ చట్టం అనే అస్త్రాన్ని ఉపయోగించి స్వాధీనం చేసుకోవడానికి చర్యలు తీసుకోవడం దుర్మార్గమన్నారు. పంటలు పండే భూములను లాక్కుంటే తాము ఎలా జీవనం చేయాలని రైతులు ప్రశ్నించారు. రైతులకు కనీస సమాచారం ఇవ్వకుండా ఎందుకు సర్వేలు చేస్తున్నారని నాయకులు ప్రశ్నించారు. చట్టాలను ఉల్లంఘించి బలవంతపు భూసేకరణ చేయడం ఎంతవరకు న్యాయమన్నారు. ఇప్పటివరకు భూ సేకరణ ద్వారా సేకరించిన భూముల్లో పరిశ్రమలను తీసుకురాలేని ప్రభుత్వం తాజాగా పరిశ్రమల పేరుతో భూములను తీసుకోవడానికి ఎలా ముందుకు వచ్చిందని ప్రశ్నించారు. మధ్యాహ్నం అయినప్పటికీ తహశీల్దార్ కార్యాలయానికి రాకపోవడంతో రైతులు తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. చివరకు బాలయ్య పిఎ వీరయ్య రైతు నాయకులకు, రైతులతో ఫోన్లో మాట్లాడారు. చిలమత్తూరులో సమస్య ఉండడంతో తహశీల్దార్ తోపాటు తాము ఇక్కడే ఉన్నామని రైతులకు జరిగిన అన్యాయంపై కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్ కు వినతిని ఇచ్చి వెళితే పరిశీలన చేసి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. అయితే రైతులు తాము వినతిని ఇచ్చే ప్రసక్తే లేదని రెండు రోజుల్లో సమస్యను పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించి అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ ఆందోళనలో సిఐటియు నాయకులు రాము, రాజప్ప, పట్టు రైతు సంఘం నాయకులు సోము కుమార్, చలివెందుల చిన్నారెడ్డి, రామలింగారెడ్డి, వందలాదిమంది రైతులు పాల్గొన్నారు.

మొక్కుబడిగా జెడ్పీ సర్వసభ్య సమావేశం

ప్రజాసమస్యలపై నామమాత్రంగానే చర్చ

ముగ్గురు ఎమ్మెల్యేలొచ్చారు.. ఛైర్‌పర్సన్ ఛాంబర్‌లో ఫొటో మార్చి వెళ్లారు...

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన జెడ్పీ సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా ముగిసింది. పట్టుమని రెండు గంటలు కూడా సమస్యలపై చర్చింకుండానే సమావేశాన్ని మమ అనిపించేశారు. ముఖ్య ప్రజాప్రతినిధులెవ్వరూ ఈ సమావేశానికి హాజరవలేదు. హాజరైన ముగ్గురు ఎమ్మెల్యేలు అమిలినేని సురేంద్రబాబు, ఎంఎస్.రాజు, దగ్గుపాటి వెంకట ప్రసాద్‌లు కూడా జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఛాంబరులోకెళ్లి మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ఫొటోను తీసేసి, ఎదురుగా గోడకున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఫొటోను ఛైర్‌పర్సన్ ఛైర్ వెనుక గోడను అంటించి వెళ్లారు. తక్కిన ఎమ్మెల్యేలు, ఎంపీలెవ్వరూ ఈ సమావేశానికి హాజరవలేదు. జిల్లా కలెక్టరు వినోద్ కుమార్ కూడా అరగంట ఆలస్యంగా సమావేశానికి హాజరయ్యారు. దీనిపై కొందరు సభ్యులు తమ అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఎప్పుడో ఒకసారి జరిగే ఈ సమావేశాలకు కూడా ఉన్నతాధికారులు హాజరుకాకపోతే తమ సమస్యలు ఎవరితో చెప్పుకోవాలని పలువురు జడ్పిటిసిలు, ఎంపిపిలు తమ అసంతృప్తి వ్యక్తం చేశారు. బుధవారంఉదయం స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయంలో జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశం ప్రారంభంలోనే దేశ సరిహద్దుల్లో పాక్ కాల్పుల్లో మృతి చెందిన జవాను మురళీనాయక్ మృతికి రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం తెలియజేశారు. అనంతరం ఆర్డీటీకి ఎఫ్‌ఆర్‌సిఎ అనుమతి రాకపోవడంతో జిల్లాకు నష్టం జరుగుతుందని పలువురు సభ్యులు ప్రస్తావించారు. సమావేశానికి హాజరైన ఎమ్మెల్యేలు సురేంద్రబాబు, ఎంఎస్.రాజు, దగ్గుపాటి వెంకట ప్రసాద్‌లు కూడా ఈ విషయంపై తమ మద్దతు తెలిపారు. ఇప్పటికే ఈ సమస్యను

జెడ్పీ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని, రాష్ట్ర ప్రభుత్వం ఆర్డీటీకి సానుకూలంగా ఫలితం వచ్చేందుకు ప్రయత్నిస్తోందని చెప్పారు. ఈ మేరకు ఈ అంశంపై తీర్మానం చేశారు.

సవేరా చంపేస్తోంది : పలువురు సభ్యులు

అనంతపురం నగరంలో సవేరా ఆసుపత్రిలో వైద్యం సక్రమంగా అందివ్వటం లేదని శెట్టూరు జడ్పిటిసి ఆరోపించారు. తమ ప్రాంతానికి చెందిన ఒక యువకుడికి సవేరాలో ఆసుపత్రికి వస్తే గుండెజబ్బు ఉందని చికిత్స అందివ్వాలని చెప్పారన్నారు. అయితే ఇక్కడ కాకుండా అదే వ్యక్తిని బెంగళూరులో చికిత్సకు తీసుకెళితే ఆ యువకుడికి గుండెజబ్బే లేనట్టు తేల్చారన్నారు. ఇలా తప్పుడు వైద్యం అందించి ప్రజలను దోచేసే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. దీనికి కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు కూడా మద్దతు తెలిపారు. అనవసరమైన పేర్లతో ప్రజలను దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. వీటిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. దీనికి కలెక్టరు వినోద్ కుమార్ స్పందిస్తూ ఆరోపణలపై దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని వైద్యఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. గిరిజన ప్రాంతాల్లో వసతులున్నా వైద్యులను నియమించకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వజ్రకరూరు జడ్పిటిసి అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. వైస్ ఛైర్మన్ నాగరత్న మాట్లాడుతూ నార్పల ఆసుపత్రిలో స్కానింగ్ మిషన్ ఉన్నా గర్భిణులకు స్కానింగు చేసే వైద్యుల్లేకపోవడంతో యంత్రం వృధాగా ఉందన్నారు. ఈ విషయాన్ని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకొచ్చినా ఫలితం లేదన్నారు. దీనిపైన అధికారులు స్పందిస్తూ ఒక మహిళా డాక్టరును నియమించామని, త్వరలో అక్కడిక వస్తారని చెప్పారు.

ఉపాధి హామీలో అక్రమాలు జరుగుతున్నాయి

ఉపాధి హామీ పథకం అమలులో అక్రమాలు జరుగుతున్నాయని పలువురు జడ్పిటిసిలు ఆరోపించారు. పనులకు రాకున్న వారి పేరు మీద కూడా బిల్లులు చెల్లిస్తున్నారని కంబదూరు జడ్పిటిసి ఆరోపించారు. అదే విధంగా నాటని మొక్కలను నాటి నట్టు చూపించి రూ.30 లక్షలు దోచేశారని ఆధారాలతో అందజేస్తామని చెప్పారు. విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డ్వామా పీడీని కలెక్టరు ఆదేశించారు.

టిడిపి నేతలు సిఫారసు చేస్తేనే పథకాలు...

టిడిపి నేతలు సిఫారసు చేస్తేనే పథకాలు వర్తింపజేస్తామని స్వయంగా తాము వెళ్లినా అధికారులు ఇదే చెబుతున్నారని బుక్కరాయసముద్రం జడ్పిటిసి ఆరోపించారు. అటువంటివి ఏవైనా ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టరు వినోద్ కుమార్ చెప్పారు.

జెడ్పీ ఛైర్‌పర్సన్ ఛాంబర్‌లో మాజీ సిఎం ఫొటో

అభ్యంతరం వ్యక్తం చేసిన ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

అనంతపురం జిల్లా పరిషత్ ఛైర్ పర్సన్ బోయ గిరిజమ్మ ఛాంబర్‌లో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఫోటో ఉండటంపై ఎమ్మెల్యేలు అభ్యంతరం తెలిపారు. బుధవారం స్థానిక జెడ్పీ కార్యాలయంలో జరిగిన జిల్లాపరిషత్ సర్వసభ్య సమావేశానికి టిడిపి ఎమ్మెల్యేలు దగ్గుపాటి ప్రసాద్ , ఎంఎస్ రాజు, అమిలినేని సురేంద్రబాబు హాజరయ్యారు. ఈసందర్భంగా వారు జెడ్పీ ఛైర్ పర్సన్ గిరిజమ్మ చాంబర్లో మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి ఫోటో ఉండటాన్ని గమనించారు. అదే సమయంలో ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఫోటో స్టోర్ రూమ్ పక్కన ఉంచడాన్ని చూశారు. . వెంటనే జెడ్పి డిప్యూటీ సీఈవోను పిలిపించి తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏ నిబంధన ప్రకారం మాజీ ముఖ్యమంత్రి ఫోటో పెడతారని ప్రశ్నించారు. వెంటనే అక్కడ జగన్మోహన్ రెడ్డి ఫోటో తీసి వేయించారు. జడ్పీ ఛాంబర్ నందు సీఎం చంద్రబాబు ఫోటోలు పెట్టించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యేలు మాట్లాడుతూ ప్రభుత్వం మారి 11 నెలలు గడుస్తున్నా ఇంకా కొంతమంది అధికారులు వైసిపి అధికారంలో ఉందన్న భ్రమలో ఉన్నారని విమర్శించారు. ఇకపై ఏ ప్రభుత్వ కార్యాలయంలో అయినా ఇలా కనిపిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతపురం నగరపాలక సంస్థ కార్యాలయంలోని మేయర్, డిప్యూటీ మేయర్ ఛాంబర్ల నందు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఫోటోలను తెలుగుయువత రాష్ట్ర అధికార ప్రతినిధి సాకే లక్ష్మీనరసింహ ఏర్పాటు చేసారు.

జెడ్పీ డిప్యూటీ సిఇఒను నిలదీస్తున్న ఎమ్మెల్యేలు

సచివాలయాల్లోని వికలాంగ ఉద్యోగులకు

బదిలీల్లో ప్రాధాన్యత కల్పించండి

ప్రజాశక్తి-హిందూపురం

గ్రామ, వార్డు సచివాలయాల వికలాంగఉద్యోగులకు బదిలీల్లో ప్రాధాన్యత కల్పించాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు అశ్వర్థ కోరారు. బుధవారం ఆయన మాట్లాడుతూ, గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న వికలాంగఉద్యోగులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని పేర్కొన్నారు. చాలామంది సుదూర ప్రాంతాల్లో పనిచేస్తూ ప్రయాణ సమయంలో ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఉద్యోగులలో కంటి సమస్యలు ఉన్న కేటగిరి ఉద్యోగులకు మినహాయింపు ఇచ్చారని అదే విధంగా ఇతర కేటగిరి వికలాంగఉద్యోగులకు దివ్యాంగుల చట్టం 2016 అనుసరించి బదిలీల్లో మినహాయింపు ఇవ్వాలని కోరారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీలను పారదర్శకంగా రాజకీయ ప్రమేయం లేకుండా ప్రలోభాలకు తావు లేకుండా చేపట్టాలని కోరారు.

జిల్లా మహానాడు ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి పుట్టపర్తి రూరల్

పుట్టపర్తి మండల పరిధిలోని మామిళ్ళకుంట క్రాస్ వద్ద జిల్లా టీడీపీ కార్యాలయంలో ఈనెల 24 న నిర్వహించే జిల్లా టీడీపీ మహానాడు ఏర్పాట్లను రాష్ట్ర మంత్రి సవితమ్మ తోపాటు మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షులు అంజినప్ప, కదిరి ఎమ్మెల్యే కందికుంట ప్రసాద్, ఇతర టీడీపీ నాయకులు బుధవారం పరిశీలించారు. టిడిపి జిల్లా మహానాడు కార్యక్రమాన్ని తొలి సారి సత్యసాయి జిల్లాలో నిర్వహించబోయే స్థలాన్ని వారు పరిశీలించి తగు సూచనలు సలహాలు అందించారు. జిల్లా మినీ మహానాడు కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని మంత్రి సవిత, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి,పార్టీ జిల్లా అధ్యక్షులు కొల్లకుంట అంజినప్ప కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు సామకోటి ఆది నారాయణ, బోయ రామాంజనేయులు, విజయ్ కుమార్, శ్రీరామ్ రెడ్డి, పుల్లప్ప ఆదినారాయణరెడ్డి, మాజీ సర్పంచి చంద్రశేఖర్, సాలెక్క, గారిశ్రీనివాసులు, శ్రీ రామ్ నాయక్, బొమ్మయ్య , రామారావు, లక్ష్మీపతి, గంగన్న, కృష్ణమోహన్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి సవిత, తదితరులు

'చంద్రబాబు'వి డైవర్షన్ పాలిటిక్స్

కక్ష సాధింపులో భాగమే వైసీపీ నేతలపై కేసులు ఎంపీ మిథున్ రెడ్డి

ప్రజాశక్తి -అనంతపురం ప్రతినిధి

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని ఎంపీ మిథున్ రెడ్డి విమర్శించారు. ఈ మేరకు ఆయన ఉమ్మడి అనంతపురం జిల్లా వైసీపీ ముఖ్య నాయకుల సమావేశంలో పాల్గొనేందుకు బుధవారం అనంతపురం విచ్చేశారు. స్థానిక అలెగ్జాండర్ హోటల్లో సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజల దృష్టిని మళ్ళించేందుకే వైసీపీ నాయకులపై తప్పుడు కేసులు పెడుతున్నారని ఆరోపించారు. ఎటువంటి ఆధారాలు లేకున్నా కట్టు కథలు అల్లి కక్షపూరితంగా మద్యం కేసులు పెడుతున్నారని విమర్శించారు. వైసిపి ప్రభుత్వం హయాంలో చేపట్టిన సంక్షేమ పథకాలకు మంగళం పాడుతున్నారన్నారు. ప్రజలకు మేలు చేసే విధంగా ఉన్న అన్నింటిని రద్దు చేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపే వారిపై కేసులు పెట్టి గొంతు నొక్కే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ఇదే పరిస్థితి కొనసాగితే ప్రజల్లో తిరుగుబాటు రాక తప్పదని హెచ్చరించారు. వైసీపీని క్షేత్రస్థాయి నుంచి పటిష్టం చేయడానికి అవసరమైన చర్యలు చేపట్టామని చెప్పారు. అందులో భాగంగానే అనంతపురం జిల్లాలోని ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించినట్లు చెప్పారు. రాబోయే రోజుల్లో పార్టీని మరింత పటిష్టం చేసే విధంగా శ్రేణులను సన్నద్ధం చేస్తున్నామనివివరించారు .ఈ సమావేశంలో వైసిపి అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకట్రామిరెడ్డి సత్యసాయి జిల్లా అధ్యక్షులు ఉష చరణ్ శ్రీ తదితరులు పాల్గొన్నారు.

ధైర్యం లేనోడికి బహిరంగ సవాళ్లెందుకు..?

జీడిపల్లి వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలవ

చెప్పుకునే దమ్ములేకే శివరామిరెడ్డి పలాయనం

మరోసారి ముఖ్యమంత్రిని నిందిస్తే ఖబడ్దార్

ప్రభుత్వ విప్ కాలవ ఫైర్

ప్రజాశక్తి - రాయదుర్గం రూరల్, బెళుగుప్ప

బహిరంగ చర్చకు రావటానికి ధైర్యం లేనోడికి బహిరంగ సవాళ్ళెందుకని వైసిపి నేత శివరామిరెడ్డి పై ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు ఫైర్ అయ్యారు. ఐదేళ్ల వైసిపి పాలనలో హంద్రీనీవా పనుల పై నిర్లక్ష్యాన్ని ఎండగడతారనే భయంతోనే శివరామిరెడ్డి ఉరవకొండ నుండి పలాయనం చిత్తగించారని విమర్శించారు. ప్రజా సమక్షంలో చెప్పుకోలేని వారు మరోసారి తమనేత, ముఖ్యమంత్రి చంద్రబాబు క్రియాశీలతను సందేహించినా, లేనిపోని అభాండాలు వేయాలని ప్రయత్నించినా సహించేదిలేదని హెచ్చరించారు. కాలవ శ్రీనివాసులు, శివరామిరెడ్డి చేసుకున్న సవాల్ మేరకు బుధవారం ఉదయం 11 గంటలకు జీడిపల్లి రిజర్వాయర్ వద్దకు కాలవ చేరుకున్నారు. తమ అభిప్రాయాలు తెలియచేయటానికి వీలుగా ప్రత్యేక వేదిక ఏర్పాట్లు చేయించారు. ఛాలెంజ్ స్వీకరించిన శివరామిరెడ్డి కోసం మధ్యాహ్నం ఒంటిగంట వరకు అక్కడే ఎదురు చూసినా ఆయన రాలేదు. ఉరవకొండ ఆర్ అండ్ బి అతిథిగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడి అటునుండి అటే వెళ్ళిపోయారు. ఈనేపథ్యంలో శివరామిరెడ్డి వైఖరిపై కాలవ శ్రీనివాసులు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఆ మాత్రం ప్రజల్లో చెప్పుకోలేనోడికి ఛాలెంజ్ ఎందుకని నిలదీశారు. ఇది పెద్దమనిషి లక్షణమేనా అని ప్రశ్నించారు. వైసిపి ప్రభుత్వంలో హంద్రీనీవా ప్రాజెక్టు పనులు పూర్తిగా ఆగిపోయాయని ధ్వజమెత్తారు. రాయలసీమ దత్త పుత్రుడు నందమూరి తారక రామారావు ఆలోచన నుండే ఈ ప్రాజెక్టు రూపకల్పన జరిగిందని వివరించారు. 1996 లో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో పనులు ప్రారంభమయ్యాయన్నారు. వైయస్ రాజశేఖర్ రెడ్డి పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వంలో వేగం పుంజుకొన్నాయని, అయితే అదే స్థాయిలో అవినీతి, అక్రమాలు జరిగాయని విమర్శించారు. 2014లో చంద్రబాబు మరోసారి ముఖ్యమంత్రి కావడంతోనే ప్రాజెక్టు ఫలాలు ప్రజలకు చేరువయ్యాయని తెలియచేసారు. 700 క్యూసెక్కుల సామర్థ్యాన్ని రెండు వేల క్యూసెక్కుల సామర్థ్యానికి విస్తరింప చేశారన్నారు. ముఖ్యమంత్రి ప్రత్యేక శ్రద్ధతో నిధులు ఖర్చుచేసి ప్రధాన, ఉపకాలువలతో పాటు రిజర్వాయర్ల నిర్మాణాలు 2019లోపు పూర్తి చేయించారన్నారు. ఫేజ్ 1, 2 పనులకు ప్రాధాన్యతనిస్తూ పనులు పరుగులు పెట్టించి అటు మడకశిర, ఇటు పుంగనూరు ఉప కాల్వలకు నీరివ్వగలిగారన్నారు. ఆ తరువాత 2019లో అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం తీరని ద్రోహాన్ని తలపెట్టిందని ఆరోపించారు. కాలువ వెడల్పు 6300 క్యూసెక్కుల పరిణామానికి పెంచుతామన్న నాటి ముఖ్యమంత్రి జగన్ గంపెడు మట్టి ఎత్తలేదని ఎద్దేవా చేశారు. వైసిపి నేతలు రాయలసీమ ద్రోహులుగా చరిత్రలో మిగిలిపోతారన్నారు. జిల్లా ప్రజాప్రతినిధులుగా నాడు చెప్పుకొన్న ఆపార్టీ నేతలు తమ నేత చేస్తున్న ద్రోహాన్ని ఏనాడైనా ప్రశ్నించారా అని ఒకసారి ఆత్మ విమర్శ చేసుకోవాలని సూచించారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబు ఎంతో ప్రత్యేక శ్రద్ధతో రూ.3700 కోట్ల నిధులు కేటాయించి పనులు చేయిస్తుంటే మెచ్చుకోకపోగా... విమర్శిస్తారా అని ప్రశ్నించారు. రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, నీటిపారుదలశాఖ మంత్రి రామానాయుడు ప్రత్యేక దృష్టి పెడుతూ పనుల్లో ఎక్కడ ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్త పడుతున్నారన్నారు. పనుల పర్యవేక్షణకు స్వయాన ముఖ్యమంత్రి చంద్రబాబే వచ్చారంటే ఆయనకు ఈ ప్రాజెక్టు ఎంత ప్రీతిపాత్రమో అర్థం అవుతుందన్నారు. కూటమి పాలనలో చంద్రబాబు ఆధ్వర్యంలో జరుగుతున్న పనులతో ప్రభుత్వం పట్ల ప్రజల్లో పెరుగుతున్న ఆదరణ చూసి వైసిపి నేతలు ఓర్వలేక పోతున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అధిష్టానం మెప్పుకోసం 'కాలవ' పాకులాట

ఉరవకొండలో హంద్రీనీవా శిలాఫలకం వద్ద తమ పార్టీ నాయకులతో ఎమ్మెల్సీ శివరామిరెడ్డి

ఇద్దరు ముఖ్యమంత్రులు చేసిన శంకుస్థాపన రాళ్ల వద్ద చర్చిద్దాం

దమ్ముంటే ఇక్కడికి రండి

వైసిపి ఎమ్మెల్సీ శివరామిరెడ్డి సవాల్

ప్రజాశక్తి ఉరవకొండ

హంద్రీనీవా కాలువ అభివృద్ధి పనులపై చర్చ అంశంపై టీడీపీ ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, వైసిపి ఎమ్మెల్సీ వై. శివరామిరెడ్డిల మధ్య మాటల తూటాలు పేలుతున్నాయి. జీడిపల్లి వద్ద వేదిక ఏర్పాటు చేశాను మీరు రండి అంటూ కాలవ శ్రీనివాసులు చెబుతుంటే.. ముందే చెప్పాం ఇద్దరు ముఖ్యమంత్రులు శంకుస్థాపన కోసం పునాదిరాళ్ళు వేసిన దగ్గరే చర్చా వేదిక ఏర్పాటు చేద్దాం దమ్ముంటే ఇక్కడికే రండి అంటూ శివరామిరెడ్డి ఉరవకొండలో సవాల్ విసిరారు. చర్చకు కాలవ శ్రీనివాసులు ఉరవకొండకు రాకపోవడంతో ఎమ్మెల్సీ శివరామిరెడ్డి హంద్రీనీవా పనుల ప్రారంభం సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకాల వద్దకు వెళుతుండగా అధికారులు అక్కడికి వెళ్లకుండా గేట్లు వేశారు. దీంతో శివరామిరెడ్డి గోడదూకి శిలాఫలకాల వద్దకు వెళ్లారు. అనంతరం హంద్రీనీవా పనుల ప్రారంభం సందర్భంగా ఏర్పాటు చేసిన పునాదిరాళ్ల వద్ద మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. హంద్రీనీవా కాలువ అభివృద్ధి పనులపై ఎవరి హయాంలో ఎంత జరిగాయో చర్చించడానికి 'మీ ఇంటికే వస్తాన'ంటూ చాలెంజ్ చేసిన కాలవ శ్రీనివాసులుకు ఆరోజే స్పష్టంగా చెప్పామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాజశేఖర్ రెడ్డి హంద్రీనీవా కోసం పునాదిరాళ్ళు వేసిన దగ్గర జగన్మోహన్ రెడ్డి నిరాహార దీక్ష చేసిన దగ్గర చర్చా వేదిక ఏర్పాటు చేయమని స్పష్టంగా చెప్పామన్నారు. అయితే ఇప్పుడు 'మీ నియోజకవర్గంలోనే పెట్టాను.. మీకోసం కుర్చీ వేశాన'ంటూ జీడిపల్లి దగ్గర మాట్లాడటం చూస్తుంటే ఆయనకు చెప్పడానికి విషయం చేతకాక. విషయం లేక ఇలా మాట్లాడుతున్నారని అర్థం అవుతుందన్నారు.. జీడిపల్లి వద్ద చర్చా వేదిక పెట్టుకుంటే అక్కడికి రావడానికి ప్రజలకు కనీస సౌకర్యాలు కూడా లేవని ఆ ప్రాంతానికి రైతులు, ప్రజలు రావడానికి రవాణా సౌకర్యం సక్రమంగా లేదని అన్నారు. ఏ ప్రాంతంలో అయితే ఈ ప్రాజెక్టుకు నాంది పడిందో అక్కడే ఆ ప్రజలు, ఆ రైతుల సమక్షంలో బహిరంగ చర్చకు తాము సిద్ధమై వచ్చామన్నారు. ఇక్కడ బహిరంగ చర్చకు రావటానికి జంకుతున్న కాలవ శ్రీనివాసులు అధిష్టానం మెప్పు పొందడానికి పాకలాడుతూ అవాకులు, చెవాకులు పేలుతున్నారని విమర్శించారు. చంద్రబాబు నాయుడు 1996 ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో రెండుసార్లు పునాదిరాళ్ళు వేసి ఆ పునాదిరాయికి అటు కిలోమీటరు ఇటు కిలోమీటరు కాలవ తవ్వి కనీసం వారికి రూపాయి డబ్బులైన చెల్లించలేదని ఎద్దేవా చేశారు. హంద్రీనీవా సామర్థ్యాన్ని 40 టీఎంసీల నుంచి నాలుగు టీఎంసీలకు కుదించి జీవో ఇచ్చింది మీపార్టీవారు కాదా అని ప్రశ్నించారు. హంద్రీనీవా కాలువను ఎట్టి పరిస్థితుల్లో పూర్తి చేయాలని లక్ష్యంతో అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి చొరవతోనే ఈ హంద్రీనీవా కాలువ ఈరోజు ఈ స్థాయిలో ఉందన్న విషయం ఎవరు మర్చిపోకూడదన్నారు. రాజశేఖర్ రెడ్డి మృతి తర్వాత మిగతా నేతలు ఈ ప్రాజెక్టు పూర్తిచేసేలా చర్యలు చేపట్టి జీడిపల్లి రిజర్వాయర్ కు 700 క్యూసెక్కుల నీరు తీసుకురావడం నిజం కాదా అని ప్రశ్నించారు. వైసిపి ప్రభుత్వం హంద్రీనీవా ఆధునీకరణ చేసి 6300 క్యూసెక్కుల నీటిని తరలించడానికి టెండర్లు పిలిచిందన్నారు. అయితే అప్పుడే ఎన్నికలు రావడంతో ఆ పనులు జరుగలేదన్నారు. ఇప్పుడు అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ఆ పనులను యధాతథంగా ఎందుకు కొనసాగించడం లేదని ప్రశ్నించారు. 6300 క్యూసెక్కుల సామర్థ్యాన్ని 3850 క్యూసెక్కులకు ఎందుకు తగ్గించారన్నారు. మొత్తం 216 కిలోమీటర్ల ఈ కాలువ మార్గానికి కేవలం రూ.700 కోట్లు మాత్రమే కేటాయించారని అన్నారు. ఈ పనుల్లో ప్రజాధనం దుర్వినియోగం అవుతోందని ఆరోపించారు. బహిరంగ చర్చా వేదికకు కాలవ శ్రీనివాసులు వస్తారని దాదాపు మధ్యాహ్నం ఒంటిగంట వరకు వేచి చూసినా రాక పోవడంతో ఎమ్మెల్సీ శివరాం రెడ్డి తన స్వగ్రామానికి వెళ్లారు.

21న లేపాక్షిలో యోగా దినోత్సవం : కలెక్టర్

ప్రజాశక్తి-లేపాక్షి

జూన్ 21వ తేదీ స్థానిక నవోదయ విద్యాలయంలో నిర్వహించే జిల్లా స్థాయి యోగా దినోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని కలెక్టర్ టీఎస్. చేతన్ తెలిపారు. యోగా దినోత్సవ వేడుకల నిర్వహణకు బుధవారం కలెక్టర్ లేపాక్షిలో నంది విగ్రహం, జటాయువు, వీరభద్రాలయం, విద్యాలయం, ఆర్టీసీ బస్టాండ్ వద్ద స్థలాలను పరిశీలించారు. చివరకు నవోదయ విద్యాల యంలో స్థలాన్ని ఎంపిక చేశారు. అనంతరం కలెక్టర్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ యోగా నెల బుధవారం నుంచి ప్రారంభమైందన్నారు. జిల్లాలో ఈ నెల 21 నుంచి జూన్ 21వ తేదీ వరకూ యోగా ఆంధ్ర-2025 క్యాంపెయిన్ నిర్వహిస్తామన్నారు. అవగాహన ర్యాలీలు, మారథాన్ పరుగు, రంగోలి, విద్యార్థులకు వివిధ అంశాలపై పోటీలు నిర్వహిస్తామన్నారు. అంతకుముందు ప్రభుత్వాసుపత్రిని సందర్శించి వివిధ విభాగాలను పరిశీలించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. వైద్య సిబ్బంది లేపాక్షి క్వార్టర్స్‌లోనే ఉండాలని సూచించారు. కలెక్టర్ వెంట ఆర్‌డిఒ ఆనంద్ కుమార్, తహశీల్దార్ సౌజన్యలక్ష్మి, ఎంపీడీవో నరసింహమూర్తి, సిఐ జనార్దన్, ఎస్ఐ నరేంద్ర, ఇతర శాఖల అధికారులు ఉన్నారు.

యోగా ప్రతి ఒక్కరిలో భాగం కావాలి

పుట్టపర్తి అర్బన్ : యోగాభ్యాసం ప్రతి ఒక్కరి జీవితంలో భాగం కావాలని కలెక్టర్ టిఎస్.చేతన్ పిలుపునిచ్చారు. 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని యోగా సాధన లక్ష్యంగా బుధవారం పట్టణంలోని సాయి ఆరామంలో కలెక్టర్ యోగా కార్యక్రమాన్ని ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆరోగ్య పరిరక్షణకు యోగా చక్కని మార్గమన్నారు. పిల్లల నుంచి పెద్దల వరకూ, స్త్రీ, పురుష భేదం లేకుండా ప్రతి ఒక్కరూ యోగాను అభ్యసించవచ్చన్నారు. నెల రోజుల పాటు సాయి ఆరామంలో జరిగే అభ్యాసంలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో యోగా గురువు చంద్రశేఖర్‌రెడ్డి, క్రీడల జిల్లా అధికారి ఉదయ్‌భాస్కర్, డిఆర్‌డిఎ పిడి నరసయ్య, వ్యవసాయ శాఖ అధికారి సుబ్బారావు, డిఎంహెచ్ఓ ఫిరోజ్‌బేగం, టూరిజం అధికారి ప్రతాప్‌రెడ్డి, డిపిఆర్ఓ వేలాయుధం, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

లేపాక్షిలో స్థలాలను పరిశీలిస్తున్న కలెక్టర్ టిఎస్.చేతన్, తహశీల్దార్, అధికారులు

అభివృద్ధి, క్రమశిక్షణకు మారుపేరు టిడిపి

మినీ మహానాడులో మంత్రి సవిత, ఎంపి బికె.పార్థసారథి

ప్రజాశక్తి-పెనుకొండ

అభివృద్ధి, క్రమశిక్షణకు మారుపేరు తెలుగుదేశం పార్టీ అని మంత్రి సవిత, ఎంపి బికె. పార్థసారథి తెలిపారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం రాష్ట్ర బిసి సంక్షేమం, చేనేత జౌళి శాఖల మంత్రి సవిత ఆధ్వర్యంలో మినీ మహానాడు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎంపి బికె.పార్థసారథి, నియోజక వర్గ పరిశీలకులు నరసింహారావు, జిల్లా అధ్యక్షులు కొల్లకుంట అంజినప్ప హాజరయ్యారు. ముందుగా స్థానిక ఎన్టీఆర్ సర్కిల్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం నాయకులు, కార్యకర్తలతో కలిసి ర్యాలీగా పార్టీ కార్యాలయం చేరుకున్నారు. అక్కడ ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి జ్యోతి ప్రజ్వలన చేశారు. మృతి చెందిన టిడిపి నాయకులు, వీరజవాను మురళీనాయక్‌కు నివాళి అర్పించారు. మంత్రి సవిత మాట్లాడూతూ వైసిపి ఐదేళ్లలో చేయలేని అభివృద్ధిని కూటమి ప్రభుత్వం పది నెలల్లోనే చేసిందన్నారు. కూటమి ప్రభుత్వంలో చేపట్టిన అభివృద్ధి పనులను వివరించారు. పార్టీ కోసం పని చేస్తున్న ప్రతి ఒక్కరికీ అండగా ఉంటాన న్నారు. ఎంపి మాట్లాడుతూ కార్యకర్తలే టిడిపికి బలం అన్నారు. తప్పు చేస్తే కాలర్ పట్టుకుని నిలదీయండి అన్నారు. క్రమశిక్షణకు మారుపేరు టిడిపి, అందరం కలిసికట్టుగా ముందుకెళ్దా మన్నారు. అనంతరం టిడిపి శ్రేణులకు మంత్రి సవిత బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు, వేలాదిమంది కార్యకర్తలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మంత్రి సవిత, చిత్రంలో ఎంపి బికె.పార్థసారథి

విశ్రాంత జవాన్లను సన్మానిస్తున్న నాయకులు

ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా ర్యాలీ

మడకశిర : ఉగ్రవాదంపై భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావడంతో సైన్యానికి మద్దతుగా బుధవారం రొళ్లలో తిరంగా ర్యాలీ చేపట్టారు. ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు, నాయకులు, ప్రజలు జాతీయజెండాలు చేతబూని భారత్‌మాతాకీ జై అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం విశ్రాంత జవాన్లు, విధుల్లో కొనసాగుతున్న జవాన్లకు సన్మానం చేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ షేక్షావలి, నాయకులు వివిఎం.పాండురంగప్ప, మార్కెట్ యార్డ్ ఛైర్మన్ బిఎస్ గురుమూర్తి, టిడిపి మండల కన్వీనర్ దాసిరెడ్డి, కార్యదర్శి జికె.ఈరన్న, కృష్ణమూర్తి, రవి, భరత్, రామకృష్ణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

'పది' సప్లిమెంటరీ పరీక్షలకు 72.16శాతం హాజరు

కొత్తచెరువు : పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా రెండో రోజైన బుధవారం జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన హిందీ పరీక్షకు 72.16 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారని డిఇఒ జి.కృష్ణప్ప, జిల్లా వృత్తి విద్యాధికారి లాజర్ తెలిపారు. మొత్తం 34 కేంద్రాల్లో 1,189 మందికి గానూ 858 మంది హాజరు కాగా 331 మంది విద్యార్థులు గైర్హాజర య్యారు. అలాగే అపోస్ పదో తరగతి పరీక్షల్లో జిల్లా వ్యాప్తంగా 7 కేంద్రాల్లో 120 మందికి గానూ 88 మంది హాజరు కాగా 32 మంది గైర్హాజరయ్యారు. ఇంటర్ పరీక్షలు జిల్లా వ్యాప్తంగా 4 కేంద్రాల్లో నిర్వహించగా 439 మందికి 393 మంది హాజరు కాగా 46 మంది గైర్హాజరయ్యారు.

రోడ్ల ఆక్రమణలపై సర్వే

కొత్తచెరువు : స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో ప్రధాన రహదారులకు ఇరువైపులా ఆక్రమణలను తొలగించాలని కలెక్టర్ టిఎస్.చేతన్ తహశీల్దార్ నీలకంఠారెడ్డిని ఆదేశించారు. దీంతో బుధవారం తహశీల్దార్ ఆర్ అండ్ బి అధికారులతో చర్చించి మండల సర్వేయర్ సురేష్ ఆధ్వర్యంలో రహదారుల వెంట కొలతలు నిర్వహిస్తున్నారు. ఆర్ అండ్ బి స్థలం ఆక్రమించుకుని ఉంటే వారికి నోటీసులు జారీ చేసి తొలగించుకోవాలని ఆదేశాలు జారీ చేయనున్నారు. వారు తొలగించకపోతే అధికారులే తొలగింపులకు శ్రీకారం చుట్టనున్నారు.

నేడు హనుమాన్ జయంతి

కదిరి అర్బన్ : హనుమాన్ జయంతి సందర్భంగా గురువారం పట్టణంలో శ్రీహనుమాన్ శోభాయాత్ర నిర్వహిస్తున్నట్లు నాయకులు మధుసూదన్ రెడ్డి తెలిపారు. శోభాయాత్ర సాయంత్రం 3 గంటలకు ఏటి గడ్డ ఆంజనేయస్వామి సన్నిధి నుంచి ప్రారంభమై కోలాటం, చెక్కభజనలు, మంగళవాయిద్యాల మధ్య సాగుతుందన్నారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, టిడిపి రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి పవన్ కుమార్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎమ్మెస్ పార్థసారథి, ప్రముఖ ఆలయాల అర్చకులు, ప్రముఖులు హాజరవుతారని తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని ప్రజలందరూ హాజరు కావాలని ఆయన కోరారు.

యోగాతో మానసిక ప్రశాంతత

బత్తలపల్లి : యోగా సాధన చేయడం వల్ల మానసిక, శారీరక ప్రశాంతత కలుగుతుందని ఎంపిడిఒ నరసింహనాయుడు సూచించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో బుధవారం ఎంపిడిఒ పర్యవేక్షణలో యోగా కార్యక్రమం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రతిరోజూ యోగా చేయడం వల్ల మనిషికి అనేక లాభాలు కలుగుతాయన్నారు. మానసిక, శారీరక ప్రశాంతత కలిగి రోజంతా ఉత్సాహంగా గడపవచ్చు అన్నారు. జూన్ 21వ తేదీ వరకూ ప్రతిరోజూ సిబ్బందితో కలిసి యోగాసనాలు వేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పరిపాలన అధికారి జి.శ్రీనివాసులు, ఏపీవో ఆదెప్ప, కార్యాలయ సిబ్బంది, టిఎలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, గృహ నిర్మాణ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపి మిథున్‌రెడ్డికి ఘన స్వాగతం

ప్రజాశక్తి-నల్లచెరువు

అనంతపురం వెళ్తున్న ఎంపి, ఉమ్మడి అనంతపురం జిల్లా రీజినల్ కోఆర్డినేటర్ మిథున్ రెడ్డికి బుధవారం నల్లచెరువులో ఆ పార్టీ మండల కన్వీనర్ మండెం రవికుమార్‌రెడ్డి జాతీయ రహదారి పై ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం మిథున్‌రెడ్డిని శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచి రమణారెడ్డి, హైటెక్ రమణ నాయక్, ఎంపిటిసిలు రఫీసుమియా, మాధవీలత, నాయకులు నరసింహారెడ్డి, అక్బర్, ఆనంద్‌రెడ్డి, గోవిందరెడ్డి, పోరెడ్డి వెంకటరెడ్డి, గోపాల్ యాదవ్, ఆదిమూర్తి, లక్ష్మీపతిరెడ్డి, శ్రీకంఠరెడ్డి, మంజునాథ్, నాగ భూషణం, షుకూర్, ఇస్మాయిల్, ఇర్ఫాన్, రాజు, రామాంజులు, వేమయ్య, మణి, శీన, లక్ష్మీపతి, మహేశ్వరరెడ్డి, బషీర్, సలీం, ఖాదర్‌వలి పాల్గొన్నారు.

ఎంపి మిథున్‌రెడ్డితో మాట్లాడుతున్న రవికుమార్‌రెడ్డి

విద్యుదాఘాతంతో మహిళ మృతి

ప్రజాశక్తి-మడకశిర

మండలంలోని దిగువ అచ్చంపల్లి గ్రామానికి చెందిన పుష్పావతి బుధవారం విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందింది. వివరాలు.. నీటి సంపు నింపాలని పుష్పావతి విద్యుత్ మోటార్ స్విచ్ ఆన్ చేయగా షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

నియోజకవర్గ అభివృద్ధే అజెండా : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

నియోజకవర్గ అభివృద్ధే నా అజెండా అని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, పార్టీ ఇన్‌ఛార్జి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని టిడిపి కార్యాలయంలో బుధవారం నిర్వహించిన పుట్టపర్తి నియోజకవర్గ మినీ మహానాడులో వారితో పాటు నియోజకవర్గ పరిశీలకులు, మాజీ ఎమ్మెల్సీ బచ్చుల పుల్లయ్య పాల్గొన్నారు. ముందుగా వారు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. టిడిపి జెండాను ఆవిష్కరించి, జ్యోతి ప్రజ్వలన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాబోయే మూడేళ్లలో నియోజకవర్గాన్ని ఉద్యానహబ్‌గా మారుస్తామన్నారు. ప్రజలకు శుద్ధిచేసిన తాగునీరు అందిస్తామన్నారు. పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ ప్రజా సంక్షేమం, అభివృద్ధే టిడిపి లక్ష్యం అన్నారు. దేశంలోనే కరుడుకట్టిన ఆర్థిక ఉగ్రవాది జగన్ అని మండిపడ్డారు. బచ్చుల పుల్లయ్య మాట్లాడుతూ జగన్ రాష్ట్రాన్ని దోచుకోగా సిఎం చంద్రబాబు అభివృద్ధి పథంలో తీసుకెళ్తున్నారన్నారు. అనంతరం నియోజకవర్గ అభివృద్ధిపై తీర్మానం చేశారు. 193 చెరువులను నింపి హార్టికల్చర్ హబ్‌గా మార్చడం, భూ సేకరణ చేసి ముంపు ప్రాంత రైతులకు పరిహారం అందించడం, పరిశ్రమలు తీసుకొచ్చి నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, పాలిటెక్నికల్ కాలేజీ, పుట్టపర్తిలో జూనియర్ కళాశాల ఏర్పాటు, బుక్కపట్నంలో డిగ్రీ కళాశాల అభివృద్ధి, బుక్కపట్నం చెరువు కింద ముంపు ప్రాంతాల రైతులకు పరిహారం చెల్లింపు, సురక్షిత తాగునీటి పథకం ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో మండలాల. కన్వీనర్లు రామాంజనేయులు, జయచంద్ర, గోపాల్‌రెడ్డి, శంకర్, విజయకుమార్, వలిపి శ్రీనివాసులు, రామకృష్ణ, మల్లిరెడ్డి, నాయకులు ఓబుల్‌రెడ్డి, శ్రీనివాసులు, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీరామ్‌నాయక్, శ్రీరామ్‌రెడ్డి, నర్సింహులు, సామకోటి ఆదినారాయణ, గంగన్న, చలపతి, రామ్, లక్ష్మణ్, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

మినీమహానాడులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి

భూ సేకరణ ఆపాలని రైతుల వినతి

ప్రజాశక్తి-లేపాక్షి

మండలంలోని కొండూరు రెవెన్యూ పొలంలో బుధవారం రెవెన్యూ అధికారులు భూ సేకరణ చేయడానికి పూనుకోగా రైతులు అడ్డుకున్నారు. ముందుగా అధికారులు పట్టాదారు పాసుపుస్తకాలు, ఆధార్ కార్డులు, బ్యాంకు పాస్ పుస్తకాలు తీసుకొని రైతులు తమ పొలాల వద్దకు రావాలని గ్రామంలో చాటింపు వేయించారు. దీంతో రైతులు అధికారులను అడ్డుకొని భూమి ఎందుకు సేకరిస్తున్నారో వివరాలు తెలుపకుండా ఎందుకు సర్వే చేస్తున్నారని నిలదీశారు. రైతులు మాట్లాడుతూ వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న తమ భూములను తీసుకుంటే ఎలా బతకాలని ప్రశ్నించారు. విషయం తెలిసిన వెంటనే ఎస్ఈ నరేంద్ర పోలీసు సిబ్బందితో వెళ్లి రైతులకు సర్ది చెప్పారు. అనంతరం రైతులు తమ భూమిని తీసుకోవద్దని కోరుతూ తహశీల్దార్ సౌజన్యలక్ష్మికి వినతి పత్రం అందచేశారు. కార్యక్రమంలో రైతులు సోమశేఖర్‌రెడ్డి, నారాయణనాయక్, నరసింహప్ప, తదితరులు పాల్గొన్నారు.

అధికారులను అడ్డుకున్న రైతులు

స్వచ్ఛభారత్ కార్మికుల వినూత్న నిరసన

ప్రజాశక్తి-గాండ్లపెంట

బకాయి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ స్వచ్ఛభారత్ కార్మికులు స్థానిక సచివాలయం ముందు చేపట్టిన ఆందోళనకు బుధవారం సిపిఎం, సిఐటియు నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం, సిఐటియు నాయకులు కార్మికులతో కలిసి చెవిలో పూలతో ఒంటి కాలిపై నిల్చొని వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. సిపిఎం నాయకుడు కెకె. రాజారెడ్డి మాట్లాడుతూ అధికారుల నిర్లక్ష్యం వల్ల సుమారు 30 నెలల నుంచి కార్మికులకు వేతనాలు అందడం లేదన్నారు. నెల నెలా సక్రమంగా వేతనం అందకుంటే కార్మికులు కుటుంబాలను ఎలా పోషించుకోవాలని ప్రశ్నించారు. కార్మికులకు వేతనాలు చెల్లించేంత వరకూ పారిశుధ్య, చెత్త సేకరణ పనులకు వెళ్లరని స్పష్టం చేశారు. అధికారులు స్పందించి వెంటనే వేతనాలు చెల్లించాలని, లేనిచో జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆందోళనలో పారిశుధ్య కార్మికుల యూనియన్ నాయకుడు అక్కులప్ప, అంజి, అనిల్, కదిరప్ప, దొడ్డప్ప, గంగులప్ప, 30 మంది కార్మికులు పాల్గొన్నారు.

చెవిలో పూలతో ఒంటికాలిపై నిల్చొని వినూత్న రీతిలో నిరసన తెలుపుతున్న కార్మికులు, నాయకులు

ఇసుక వాహనాల తనిఖీ

ప్రజాశక్తి-బత్తలపల్లి

ఇసుకను తరలించే సమయంలో వాహనదారులు తప్పనిసరిగా భద్రతా నియమాలు పాటించాలని ఎస్ఐ సోమశేఖర్ సూచించారు. ఎస్ఐ పోలీసు సిబ్బందితో కలిసి బుధవారం బైపాస్ వద్ద ఇసుక తరలించే వాహనాలను తనిఖీ చేశారు. ఇసుక రవాణా చేస్తున్న వాహనాలను ఆపి, వాటికి సంబంధించిన అనుమతి పత్రాలను పరిశీలించారు. అలాగే వాహనదారులకు పలు సూచనలు చేశారు. ఇసుక తరలించేటప్పుడు తప్పనిసరిగా దానిపై టార్పాలిన్ కప్పుకోవాలని ఆదేశించారు. లేనిచో వెనుక వస్తున్న వాహనదారుల కళ్లల్లో ఇసుక రేణువులు పడి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. భవిష్యత్తులో ఎవరైనా ఇసుకను తరలించేటప్పుడు భద్రతా నిబంధనలు పాటించకపోతే జరిమానా విధిస్తామని హెచ్చరించారు. రహదారి భద్రతకు అందరూ సహకరించాలని కోరారు.

ఇసుక టిప్పర్లను తనిఖీ చేస్తున్న ఎస్ఐ, పోలీసులు

సచివాలయంలో గత ప్రభుత్వ ఫ్లెక్సీలు తొలగింపు

ప్రజాశక్తి-బత్తలపల్లి

స్థానిక సచివాలయం-2లో గత ప్రభుత్వానికి సంబంధించిన ఫ్లెక్సీలు, గోడపత్రికలు ఉండగా బుధవారం టిడిపి నాయకులు వాటిని తొలగించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం మారి ఏడాదైనా గత ప్రభుత్వ గోడపత్రికలు, ఫ్లెక్సీలను తొలగించాలని సచివాలయ సిబ్బందికి ఆలోచన రాకపోవడం విచారకరమన్నారు. మండలంలోని మిగతా కార్యాలయాల్లో కూడా గత ప్రభుత్వానికి సంబంధించి ఏవైనా ఫొటోలు, ఫ్లెక్సీలు, గోడ పత్రికలు ఉంటే అధికారులు వెంటనే తొలగించాలని కోరారు. కార్యక్ర మంలో నాయకులు నెట్టెం రమణ, నాగార్జునరెడ్డి, శ్రీరాములు, సదాశివ, సయ్యద్‌రఫీ, యూసుఫ్, రాజు, రాఘవ, తదితరులు పాల్గొన్నారు.

వైసిపి ప్రభుత్వ ఫ్లెక్సీలను తొలగిస్తున్న టిడిపి నాయకులు

వర్షానికి దెబ్బతిన్న రోడ్డు పరిశీలన

ప్రజాశక్తి-మడకశిర

ఇటీవల నియోజకవర్గ వ్యాప్తంగా కురిసిన భారీ వర్షాలకు ధ్వంసమైన రోడ్లను బుధవారం మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి పరిశీలించారు. అందులో భాగంగా రొళ్ల మండలంలోని గొడ్డగురికి గొల్లహట్టి గ్రామంలో వర్షాలకు ధ్వంసమైన రోడ్డును స్థానిక టిడిపి నాయకులతో కలిసి పరిశీలించారు. అలాగే ప్రజలకు ఇబ్బంది లేకుండా త్వరగా మరమ్మతులు చేయించాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట టిడిపి మండల కన్వీనర్ దాసిరెడ్డి, ఈరన్న, భరత్, హేమంత్, శ్రీనివాస్, రామకృష్ణ ఉన్నారు.

ధ్వంసమైన రోడ్డును పరిశీలిస్తున్న గుండుమల తిప్పేస్వామి

విద్యార్థులకు ప్రతిభా అవార్డులు ప్రదానం

ప్రజాశక్తి-పెనుకొండ

కృషి, పట్టుదల ఉంటేనే లక్ష్యాన్ని చేరుకోవడం సులువు అవుతుందని మంత్రి సవిత విద్యార్థులకు సూచించారు. 2024-25 విద్యా సంవత్సరంలో నియోజకవర్గ వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివి పదో తరగతి, ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు బుధవారం పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఎస్ఆర్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాలు అందజేశారు. మంత్రి మాట్లాడుతూ సమాజ సేవ కోసమే ఎస్ఆర్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ ఉందన్నారు. ట్రస్ట్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. సంకల్పం మంచిదైతే విజయం తనంతట తానే దరి చేరుతుందన్నారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో విద్యనభ్యసిస్తే జీవితంలో ముందు కెళ్లడం పెద్ద పనేమీ కాదన్నారు. విద్యార్థులు విలువైన సమయాన్ని వృథా చేసుకోవద్దని సూచించారు. అవసరం మేరకే సెల్‌ఫోన్ వినియోగించాలన్నారు. చక్కగా చదువుకొని తల్లిదండ్రులు, ఉపాధ్యా యులు, గ్రామానికి మంచి పేరు తీసుకొచ్చి సమాజానికి ఉపయోగపడేలా ఎదగాలన్నారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షులు అంజినప్ప, కూటమి నాయకులు, ట్రస్ట్ డైరెక్టర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేస్తున్న మంత్రి సవిత

ముందస్తు అడ్మిషన్లను అరికట్టాలి

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

నిబంధనలకు విరుద్ధంగా పట్టణంలో ముందస్తు అడ్మిషన్లు చేసుకుంటున్న ప్రయివేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని పిఎస్‌యు జిల్లా అధ్యక్షులు నందకిషోర్, ఎన్ఎస్‌యుఐ నాయకులు గణేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు బుధవారం ఆర్‌డిఒ మహేష్‌కు వినతి పత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభం కాకమునుపే ప్రయివేటు విద్యాసంస్థలు విద్యార్థుల తల్లిదండ్రులను ప్రలోభ పెట్టేలా ప్రచారం చేయడంతో పాటు ముందస్తు అడ్మిషన్లు చేపడుతున్నారన్నారు. అలాగే పాఠశాలలోనే పాఠ్య, నోట్ పుస్తకాలు, యూనిఫారం, ఇతర విద్యా సామగ్రిని అధిక ధరకు విక్రయిస్తున్నారన్నారు. అత్యధిక ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. అలాంటి పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిచో ఆయా పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల ఎదుట పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో రవి, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

కొత్తచెరువులో డిఇఒ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

కొత్తచెరువు : జిల్లా వ్యాప్తంగా ప్రయివేట్ విద్యాసంస్థల్లో చేపడుతున్న ముందస్తు అడ్మిషన్లను అరికట్టాలని జిల్లా ఎఐఎస్‌బి అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం స్థానిక డిఇఒ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించా రు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ప్రయివేట్ పాఠశాలల్లో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. అయినా పాఠశాలల్లో ఎలాంటి మౌలిక సదుపాయాలు కల్పించడం లేద`న్నారు. అలాంటి పాఠశాలలపై చర్యలు తీసుకో వాలని కోరారు. అలాగే 25శాతం మంది పేద విద్యార్థులను పాఠశాలల్లో చేర్చుకోవాలన్నారు.

పెద్దకోట్లలో కార్డెన్‌సెర్చ్

ప్రజాశక్తి-తాడిమర్రి

మండలంలోని సమస్యాత్మక గ్రామమైన పెద్దకోట్లలో బుధవారం సాయంత్రం ముదిగుబ్బ రూరల్ సిఐ శ్యామరావు ఆధ్వర్యంలో పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఇందులో భాగంగా రౌడీషీటర్స్, ట్రబుల్ మాంగలర్స్ ఇళ్లు, గడ్డివాములు, ఇంటి పరిసరాల్లో సోదాలు చేసి వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం ప్రజలతో గ్రామసభ నిర్వహించి సైబర్ నేరాలు, బాలికలు, మహిళలపై జరిగే అఘాయి త్యాలు, అసాంఘిక కార్యకలాపాల నియంత్రణపై, రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలని సూచించారు. గొడవలు, కక్షలు, కార్పణ్యాలకు దూరంగా ఉండాలన్నారు. బాధ్యతగా నైతిక విలువలు కలిగి అందరూ సఖ్యతగా జీవించాలన్నారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడకుండా జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. వాహన చోదకుల లైసెన్స్, ఆర్‌సి, ఇన్సూరెన్స్ పత్రాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో తాడిమర్రి, పట్నం ఎస్ఐలు కృష్ణవేణి, రాజశేఖర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

1 నుంచి ఉచిత కంప్యూటర్ శిక్షణ

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

ఎపి నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో స్కిల్ హబ్ ఏర్పాటు చేశామని ప్రిన్సిపల్ జెవి.సురేష్ బాబు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి బి.హరికృష్ణ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. వారు మాట్లాడుతూ స్కిల్ హబ్‌లో జూన్ 1వ తేదీ నుంచి ఎంఐఎస్ డేటా అనలిస్ట్ ఫైనాన్షియల్ సర్వీసెస్ కోర్సును ప్రారంభిస్తామన్నారు. పదో తరగతి, ఇంటర్ పాసైన విద్యార్థులు, డిగ్రీ(బిఎ, బీకాం), పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి ఆసక్తి కల్గిన యువతీ, యువకులు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 9182288465 నంబర్‌కు ఫోన్ చేయాలని లేదా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సంప్రదించాలన్నారు. శిక్షణ అనంతరం ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు.

పరిటాల శ్రీరామ్‌కు ఘన స్వాగతం

ప్రజాశక్తి-ముదిగుబ్బ

మండలంలోని గుడ్డంపల్లితండాలో బుధవారం నిర్వహించిన మారెమ్మ జాతరలో ధర్మవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ పాల్గొన్నారు. ముందుగా శ్రీరామ్‌కు తండావాసులు ఘనంగా ఆహ్వానం పలికారు. తండాలోకి ప్రవేశించగానే పూలమాలలు వేసి హారతి ఇచ్చి ఘన స్వాగతం పలికారు. అనంతరం శ్రీరామ్ స్థానిక టిడిపి నాయకులతో కలిసి మారెమ్మ దేవతను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

పరిటాల శ్రీరామ్‌కు పూలమాల వేసి స్వాగతం పలుకుతున్న తండావాసులు

మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీకి నివాళి

ప్రజాశక్తి-కదిరి టౌన్

మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ వర్ధంతి కార్యక్రమాన్ని బుధవారం పట్టణంలో కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన చిలమత్తూరు మోహన్ గాంధీ రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మోహన్ గాంధీ మాట్లాడుతూ రాజీవ్‌గాంధీ ప్రధానిగా దేశానికి చేసిన సేవలను కొనియాడారు. అనంతరం ఉగ్రవాదానికి వ్యతిరేకంగా శాంతిని నెలకొల్పేందుకు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఇందాదుల్లాఖాన్, షౌకత్ అలీఖాన్, చంద్ర, మహేష్, రాఘవ, సునీల్, చంద్రిల్, సాయిమోహన్ పాల్గొన్నారు.

ధర్మవరం రూరల్ : కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలో మాజీ ప్రధానమంత్రి రాజీవ్‌గాంధీ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ముందుగా స్థానిక కళాజ్యోతి సర్కిల్‌లోని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహం వద్ద రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆ పార్టీ నాయకులు తుంపర్తి పరమేష్ మాట్లాడుతూ రాజీవ్‌గాంధీ అతి చిన్న వయస్సులోనే దేశానికి ప్రధానమంత్రి అయ్యారన్నారు. 1984-89 వరకూ దేశానికి ఎన్నో సేవలు అందించారన్నారు. 1991లో తమిళనాడులో ఎల్‌టిటిఈ ఉగ్రదాడిలో దుర్మరణము చెందారన్నారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన ప్రతి ఒక్కరూ రాజీవ్‌గాంధీ అడుగుజాడల్లో నడవాలన్నారు. కార్యక్రమంలో కలీం, మునాఫ్, టిప్పుసుల్తాన్, మురళి, తాహిర్, రాజు పాల్గొన్నారు.

కదిరిలో రాజీవ్‌గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

చెరువులో ఆక్రమణలు తొలగించాలని వినతి

ప్రజాశక్తి-పావగడ

తాలూకాలోని సికె.పుర గ్రామానికి చెందిన ముదుకనకుంట చెరువులో ఆక్రమణలను తొలగిం చాలని కోరుతూ బుధవారం కర్నాటక రాష్ట్ర రైతు సంఘం, హరిత రైతు సేనా సభ్యులు తాలూకా కార్యాలయం ఎదుట నిరసన చేపట్టి తహశీల్దార్ వరదరాజుకు వినతిపత్రం సమర్పించారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు పూజారప్ప మాట్లాడుతూ ముదుకనకుంట చెరువు స్థలాన్ని కొందరు ప్రయివేటు వ్యక్తులు ఆక్రమించారని గ్రామస్తులు పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదన్నారు. ఇకనైనా అధికారులు స్పందించి చెరువులో ఆక్రమణలను తొలగించాలని, లేనిచో పోరాటం ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో తాలూకా రైతు సంఘం అధ్యక్షుడు శివు, జిల్లా ఉపాధ్యక్షుడు హనుమం తరాయప్ప, తాలూకా ప్రధాన కార్యదర్శి నరసన్న, కార్యదర్శి పూజారి చిత్తయ్య, రమేష్, గోవింద, వీరభద్రప్ప, దుర్గప్ప, సంజీవప్ప, నాగప్ప, హనుమం తరాయప్ప, రామంజి, తిమ్మన్న, లక్ష్మణ్, రామన్న పాల్గొన్నారు.

ఉచిత పశు వైద్యశిబిరం

లేపాక్షి : మండలంలోని బసవన్నపల్లి గ్రామంలో బుధవారం దొడ్ల పాల డెయిరీ ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా ప్రోక్యూర్మెంట్ రాష్ట్ర అధికారి యుగంధర్‌రెడ్డి, వెటర్నరీ డాక్టర్ గంగాధర్ పాల్గొని పాడి రైతులకు పశువులకు వ్యాధి నిరోధక టీకాలు, వైద్య చికిత్స, నట్టల నివారణ మందులు, శాస్త్రీయ యాజమాన్యంపై అవగాహన కల్పించారు. రైతులకు దొడ్ల డెయిరీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. శిబిరంలో అనంతపురం ఏరియా మేనేజర్ మల్లికార్జున, యూనిట్ ఇన్‌ఛార్జి జయారామిరెడ్డి, సూపర్వైజర్ కార్తీక్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఎండియు ఆపరేటర్ల తొలగింపు తగదు

గుడిబండ : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం ఎండియు ఆపరేటర్లు డిప్యూటీ తహశీల్దార్ కళ్యాణ్ చక్రవర్తికి వినతి పత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ మండలంలో 10 మంది ఎండియు ఆపరేటర్లు ఆరేళ్లుగా సేవలు అందిస్తున్నామ న్నారు. అగ్రిమెంట్ ప్రకారం ఇంకా 20 నెలలు ఉందని, ఉన్నఫళంగా తొలగిస్తే మా కుటుం బాలు రోడ్డున పడతాయని ఆవేదన వ్యక్తం చేశా రు. కావున మా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమం లో ఎండియు ఆపరేటర్లు శివరాజ్, రవికుమార్, మహేంద్రగుప్తా, వెంకటేష్, గోపాల్‌నాయక్, రంగస్వామి, తిప్పేస్వామి, పాల్గొన్నారు.

బాలికపై అత్యాచారయత్నం.. నిందితుడికి దేహశుద్ధి

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన ఎనిమిదేళ్ల చిన్నారిపై ఓ వ్యక్తి అత్యాచారయత్నానికి పాల్పడగా స్థానికులు అతనికి దేహశుద్ధి చేసి పోలీసులు అప్పగించారు. గ్రామానికి చెందిన నరసింహమూర్తి మద్యానికి బానిసై జులాయిగా తిరిగేవాడని, భార్య పిల్లలు వదిలేసి వెళ్లారని స్థానికులు తెలిపారు. మధ్యాహ్నం రెండు గంటల సమయంలో బాలిక ఆడుకుంటుండగా నరసింహమూర్తి బాలికను తన ఇంటిలోకి తీసుకువెళ్లి అసభ్యంగా ప్రవర్తించాడని, బాలిక కేకలు వేస్తూ బయటకు పరిగెత్తి రావడంతో గమనించిన స్థానికులు నిందితుడికి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారని గ్రామస్తులు తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.